క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు

కర్నూలు కల్చరల్: చిన్నతనం నుంచి విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక్ దాస్ సూచించారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు, భక్త ప్రహ్లాద బడి విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధ్యాత్మిక అంశాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పురాణ ఇతిహాసాలు, రామాయణం, మహాభారతాల గురించి వివరించాలన్నారు. భక్త ప్రహ్లాద బడి విద్యార్థులు ప్రదర్శించిన నృసింహ నాటకం, నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలిచాయి.

వేసవిలో చిన్నారులు జాగ్రత్త



చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ రాంప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): వేసవి కాలంలో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ జి.రాంప్రసాద్ సూచించారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్ పేటలోని జీవీఆర్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో చిన్నారులకు చికిత్సతో పాటు అవసరమైన వారికి ఉచితంగా వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామప్రసాద్ మాట్లాడుతూ.. చిన్నారులు ఉదయం, సాయంత్రం మాత్రమే స్విమ్మింగ్, సైక్లింగ్ చేయాలన్నారు. వేసవిలో పిల్లలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమ ఆసుపత్రిలో ప్రతి శనివారం పిల్లలకు ఉచితంగా వ్యాక్సిన్లు వేస్తామని వెల్లడించారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



శ్రీనివాసరెడ్డి

కర్నూలు సిటీ: నగరంలోని ప్రభుత్వ (టౌన్ మోడల్) ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఏ.శ్రీనివాసరెడ్డికి ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయన తెలుగు వెలుగు పత్రికల్లోని కథలు–పరిశీలన అనే అంశంపై సిద్ధాంత పత్రాన్ని సమర్పించారన్నారు. ఈ అంశంపై ఎస్వీ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు ఆర్.రాజేశ్వరమ్మ మార్గదర్శకులుగా వ్యవహరించారని, కథల్లోని సామాజిక, మానవీయ కోణాలను శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించడంతో ఆయనకు డాక్టరేట్ లభించిందన్నారు.


త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న సభ్యులు

కల్లూరు: కర్నూలు పట్టణం శరీన్‌నగర్‌లో ప్రాంతంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కర్నూలు, కల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు. ఆ సమితి కర్నూలు, కల్లూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పురుషోత్తం, నాగయ్య, కళ్యాణ్, శివ, గంగాధర్, ఓబులేసు, ఈశ్వరయ్య, అక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పూజారి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని స్థానికులే కాకుండ కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. పూజారులు మూలవిరాట్‌లకు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన,అభిషేకాలు, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ఆస్పరి మఠంలో అన్నదానం చేశారు.

వెన్నుపూస ‘బ్రేక్’ర్లు

- పలు ప్రాంతాల్లో ఎత్తుగా స్పీడ్‌బ్రేకర్లు
- అదుపుతప్పి పడుతున్న వాహన చోదకులు



గాయత్రి ఎస్టేట్‌లో వేసిన స్పీడ్ బ్రేకర్

కర్నూలు(హాస్పిటల్): – స్థానిక గాయత్రి ఎస్టేట్స్‌లో నివసించే ఓ డాక్టర్ కొన్నేళ్ల క్రితం తన భార్యతో కలిసి నగర శివారులో ఉన్న ఓ ఇంజినీరింగ్ కాలేజీలో కుమార్తెను చూసి వచ్చేందుకు బైక్‌పై వెళ్లారు. కుమార్తెతో మాట్లాడి ఇంటికి వస్తుండగా ఎత్తైన స్పీడ్ బ్రేకర్ ఉండటంతో వెనుక కూర్చున్న ఆమె అదుపు తప్పి కింద పడి మరణించింది.

– కోడుమూరులోని కొత్తపేటకు చెందిన వంశీకృష్ణ గత జనవరి 13న బైక్‌పై కర్నూలు వెంకటరమణ కాలనీ నుంచి జాతీయ రహదారివైపుగా వెళ్లారు. మధ్యలో స్పీడ్ బ్రేకర్‌పైకి ఎక్కగా అదుపుతప్పి కింద పడి ఆసుపత్రిలో చేరి అదే నెల 18న మరణించారు. వీరిద్దరే కాదు కర్నూలు నగరంలో స్పీడ్‌బ్రేకర్ల బారిన పడి చాలా మంది గాయాల పాలవడం లేదా ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. పరిమితికి మించి స్పీడ్ బ్రేకర్లు నిర్మాణం చేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. దీనికితోడు అవసరం లేని చోట కూడా స్పీడ్‌బ్రేకర్లు వేయడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కర్నూలు నగరంలో 6 లక్షలకు పైగా జనాభా ఉంది. ప్రతిరోజూ 3 లక్షలకు పైగా వివిధ రకాల వాహనాల్లో తిరుగుతుంటాయి. నగరంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులతో పాటు పేరెన్నికగన్న విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు ఉన్నాయి. ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచే గాక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు రైతులు, వ్యాపారులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కారణంగా ఉదయం నుంచి రాత్రి వరకు కర్నూలు నగరం నిత్యం రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా రాజ్‌విహార్, కలెక్టరేట్, విశ్వేశ్వరయ్య సర్కిల్, సి.క్యాంపు సెంటర్, నంద్యాల రోడ్డు, నంద్యాల చెక్‌పోస్టు, నందికొట్కూరు రోడ్డు, బళ్లారి చౌరస్తా, కిడ్స్ వరల్డ్, ఎస్వీ సర్కిల్, వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రద్దీలో ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. అలాగే ప్రధాన కూడళ్లలో ప్రమాదాలు జరగకుండా ఇటీవల స్పీడ్ బ్రేకర్లు వేశారు.

అవసరానికి మించి స్పీడ్ బ్రేకర్లు

ప్రధాన రహదారులతో పాటు నగరంలోని మున్సిపల్ రోడ్లలోనూ అడుగడునా స్పీడ్ బ్రేకర్లు వేశారు. ఎవరికి వారు ఇళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా వేసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నించే అధికారి లేకపోవడంతో ఇతరులు కూడా వారి ఇళ్ల ముందు స్పీడ్ బ్రేకర్లు వేస్తున్నారు. అవి కూడా పల్లంగా గాకుండా ఎత్తుగా వేస్తుండటంతో వాహన చోదకులు అదుపు తప్పి కింద పడిపోతున్నారు. కొన్ని చోట్ల ఎక్కువ ఎత్తుగా స్పీడ్ బ్రేకర్లు వేసి ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాటికి మార్కర్లు కూడా లేకపోవడంతో చూసుకోకుండా వెళ్లి అదుపు తప్పుతున్నారు. కొందరు గాయాల పాలవుతుండగా మరి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు.

స్పీడ్ బ్రేకర్లకు మార్కర్లు వేయాలి



కర్నూలు నగరంలో ఇటీవల స్పీడ్ బ్రేకర్లు చాలా పెరిగాయి. స్పీడ్ బ్రేకర్లు ఉండటం మంచిదే. కానీ అవి మరీ ఎత్తుగా ఉంటున్నాయి. దీనికి తోడు వాటికి ముందు గుర్తులు కూడా ఉండటం లేదు. దీనివల్ల వాహనదారులు చూసుకోకుండా వేగంగా వచ్చి కింద పడుతున్నారు. మరికొందరికి నడుముపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఈ కారణంగా నడుము నొప్పి, నరాల వాపు, కాళ్ల నొప్పులతో మా వద్దకు చికిత్స కోసం వస్తున్నారు. స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గించి, వాటి ముందు మార్కులు వేస్తే మంచిది.

– డాక్టర్ బి.సురేంద్రబాబు, న్యూరో ఫిజీషియన్, కర్నూలు

నేడు సుందరయ్య వర్ధంతి సభ

కర్నూలు(సెంట్రల్): ప్రజల కోసమే జీవితాన్ని అంకితం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగే కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమస్యకు నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని, సమస్య పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు http:// meekosam .ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని వివరించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు

- ప్రభుత్వమే టార్గెట్ చేసి వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడం సరికాదు
- పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): రాజకీయ కక్షతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రభుత్వం వేధించడం, అక్రమ కేసులు నమోదు చేయడం తగదని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక సి.క్యాంపులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వమే ప్రత్యర్థి పార్టీల నాయకులపై కక్షగట్టి వరుసగా కేసులు వేస్తూ బెయిల్ రాకుండా నెలల తరబడి జైలులో మగ్గే విధంగా చేయడం సహించరాని విషయమన్నారు. ఆరోగ్యం దెబ్బతిన్న, కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నా కనికరం లేకుండా కక్ష తీర్చుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాని అసమర్థ పాలనను చంద్రబాబు నాయుడు నడిపిస్తున్నారన్నారు. వ్యక్తిగత కక్ష తీర్చుకోవడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని హెచ్చరించారు. అధికారం చేతిలో ఉంది కదా అని వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్న కూటమి పార్టీల నాయకులకు అధికారం శాశ్వతం కాదన్న విషయం గుర్తుకు పెట్టుకోవాలన్నారు. వ్యక్తిగత కక్షలు పక్కన పెట్టి ఇచ్చిన హామీలు నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడి ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడిగా కర్నూలు జిల్లాకు చెందిన కె.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మే 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ సమితి సమావేశాల్లో జిల్లా కార్యదర్శిగా ఉన్న కె.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిరుద్యోగ సమస్యలపై జాతీయ స్థాయిలో పోరాటం చేసేందుకు తనకు వేదిక దక్కడం సంతోషకరమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

తప్పిన ప్రమాదం



కారులోని ప్రయాణికులను కాపాడేందుకు యత్నిస్తున్న స్థానికులు

హాలహర్వి: మండలంలోని విరుపాపురం–నిట్రవట్టి గ్రామాల మధ్యలో ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం వాటిల్లకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. హొళగుంద మండలం సుళువాయి గ్రామానికి చెందిన ఆరుగురు ఆదివారం ఉదయం బళ్లారికి బయలుదేరారు. మార్గ మధ్యలో కారు అదుపు తప్పి రోడ్డుపక్కకు దూసుకుపోయింది. కాగా కారులోనున్న వారు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం



బాధితుడు గోపాల్‌కు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న దేవనకొండ మండలం నేలతలమర్రి గ్రామానికి చెందిన తగరం గోపాల్‌కు సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు తక్షణ సాయం కింద రూ.5 లక్షలు ఇచ్చినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ తన కార్యాలయంలో చెక్కును బాధితుడుకి అందజేశారు. రెండు రోజుల క్రితం కర్నూలుకు వచ్చిన చంద్రబాబునాయుడును తగరం గోపాల్ భార్య సువర్ణమ్మ కలిసి తన భర్తకు వ్యాధి నివారణకు రూ.12 లక్షల విలువచేసే ఇంజెక్షన్లు వేయాలని వేలూరు సీఎంసీ వైద్యులు చెప్పినట్లు విన్నవించారు. అందుకు ఆయన స్పందించి గోపాల్ వైద్యం కోసం ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో ఆదివారం రూ.5 లక్షల చెక్కును బాధితుడు గోపాల్‌కు కలెక్టర్ అందజేశారు.

దర్గాలో ఎస్వీ ప్రార్థనలు



జగద్గురు దర్గాలో దువా చేస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): స్థానిక చిన్న మార్కెట్ వద్ద ఉన్న హజ్రత్ సయ్యద్ షా ఖాలిఖ్ లింగ జగద్గురు దర్గా ఉరుసు సందర్భంగా ఆదివారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలతో కలిసి ఆయ న దువా చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు పత్తా బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్బర్, మెహబూబ్, శంకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విఠల్ నగర్‌లో తాగునీటి కష్టాలు



నిరుపయోగంగా మారిన నీటి ట్యాంకు

కర్నూలు నగరంలోని దేవనగర్ రైల్వేగేటు వద్ద ఉన్న విఠల్ నగర్‌లో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది పేదలు నివశిస్తున్నారు. అందరికీ వ్యక్తిగతంగా మంచినీటి కుళాయిలు లేవు. ఉన్న వారికి కూడా ఇటీవల కుళాయిల్లో రోజు విడిచి రోజు నీరు వస్తున్నా గంటసేపు కూడా వదలడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో పబ్లిక్ బోర్లు కూడా లేవు. గతంలో నీటి ఎద్దడి నివారణకు రోడ్లపై మంచి నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఇటీవల మురుగు కాల్వల నిర్మాణ సమయంలో అవి కూడా దెబ్బతినడంతో ప్రస్తుతం మంచినీటి సమస్య తీవ్రమైంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – కర్నూలు(హాస్పిటల్)

అ‘పూర్వ’ కలయిక



పెద్దపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కల్లూరు: ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 25 ఏళ్ల తర్వాత ఆ మిత్రులందరూ ఒకచోటికి చేరారు. కల్లూరు మండలం పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం గెట్ టు గెదర్ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నారు. పాతికేళ్ల తర్వాత మిత్రులందరూ ఒకచోట కలవడంతో చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పకలరించుకుని కష్టసుఖాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు శివనాగరాజు, దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషఫణి శర్మ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలన్నారు. ఉపాధ్యాయురాలు సావిత్రమ్మ మాట్లాడుతూ.. 25 ఏళ్ల తర్వాత తమ పిల్లలను మరోసారి చూసినట్టుందని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. మహిళా ఉపాధ్యాయులు ప్రభావతమ్మ, పద్మ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాల్లో వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు వారికి చదువులు చెప్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి విందు భోజనాలు చేశారు. మధ్య మధ్యలో కృష్ణారెడి మాట్లాడుతూ.. అందరిలో నవ్వులు పూయించారు. కార్యక్రమంలో రాముడు, రవికుమార్, సదాశివుడు, హరిబాబు, మద్దిలేటి, శ్రీనివాసులు, మహేశ్వర్‌రెడ్డి, అయ్యస్వామి, లోకేష్, సురేష్, అశోక్, మరో 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన అరటి చెట్లు
- రూ.50 లక్షల ఆస్తినష్టం



సి.బెళగల్‌లో కురుస్తున్న వర్షం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ, హుసేనాపురం గ్రామాల పరిధిలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అరటి తోటలు, కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి అపార నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. కాల్వ గ్రామానికి చెందిన అక్బర్‌వలీ నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకొని అరటి తోటను సాగు చేశారు. పంట కోత దశలో అకాల వర్షం కురవడంతో చెట్లన్నీ నేలకూలాయి. అదేవిధంగా బోయ ఆంజనేయులు అనే రైతు తమకున్న 4.80 ఎకరాలతో పాటు, 8 ఎకరాలను కౌలుకు తీసుకొని అరటి, కొబ్బరి తోటలను సాగు చేశాడు. ఈ క్రమంలో గాలివాన బీభత్సానికి చెట్లు నేలకూలాయి. వీరిద్దరికి సంబంధించి మొత్తం 16 ఎకరాలలో రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. ఇలా సుమారు 250 మంది రైతులకు సంబంధించి 160 ఎకరాలలో నష్టం వాటిల్లినట్లు తెలిసింది. జరిగిన నష్టాన్ని పరిశీలించి పరిహారం చెల్లించాల్సిందిగా బాధిత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

విస్తారంగా వర్షాలు

సి.బెళగల్: మండలంలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం పలు గ్రామాల్లో గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలో 19.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. కాగా గాలి వానతో రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరాకు ఏర్పడుతుండడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం

కర్నూలు(రూరల్): మండల పరిధిలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. శనివారం, ఆదివారాల్లో కురిసిన వర్షానికి ఈ.తాండ్రపాడు, గోందిపర్ల, పూలతోట, దేవమాడ గ్రామాల్లో వరి కుప్పలు తడిచిపోయియి. దేవమాడ గ్రామంలో మొక్కజొన్న పంట దెబ్బతింది. కోత సమయంలో అకాల వర్షాలకు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దెబ్బతిన్న అరటి తోటలో దిగాలుగా రైతు బోయ ఆంజనేయులు



అరటి తోటలో విరిగిపడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కౌలు రైతు అక్బర్‌వలి



పూలతోట గ్రామంలో తడిసిన వరిని చూపుతున్న రైతు ముత్తుబాషా

రోడ్లపై మడుగులు



ధనలక్ష్మి నగర్‌లో రోడ్డుపై నీటి మడుగులు



ఎఫ్‌సీఐ కాలనీ–2లో రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు

మండలంలో శనివారం కురిసిన వర్షానికి రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి మడుగులు ఏర్పడ్డాయిజ గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. కల్లూరు అర్బన్ కాలనీ 20వ వార్డు ధనలక్ష్మినగర్, 21వ వార్డు ఎఫ్‌సీఐ కాలనీ–2, మహాలక్ష్మి నగర్, 37, 41వ వార్డు పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో మట్టి రోడ్లపై వర్షపు నీటితో మడుగులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వెంగన్న బావి నుంచి కర్నూలుకు వచ్చే 44వ జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డుపై అక్కడక్కడా వర్షపు నీరు నిలిచింది. – కల్లూరు